క్లుప్తంగా

ధాన్యం తూకంలో తేడాలు రావొద్దు



మాట్లాడుతున్న సివిల్ సప్లై అధికారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లి, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం సివిల్ సప్లై అధికారులు సందర్శించారు. తూకంలో తేడాలు రావొద్దని, రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రోజువారీ జాబితాను పరిశీలించారు. కాంటాలు వెంటవెంటనే వేయడంతోపాటు ధాన్యం బస్తాలను కేటాయించిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జూలపల్లి: మహిళలు స్వయంశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం గ్రామ స్వరాజ్య సంస్థ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 40మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల శిక్షణ కేంద్రం కోసం తన సొంత ఇంటిని ఇవ్వనున్నట్లు తెలిపారు. కుట్టుశిక్షణ పొందిన మహిళలకు 50శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు అందిచేందుకు సంస్థ ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ధనలక్ష్మి, టైలర్ శిక్షకురాలు మిట్టపెల్లి స్వప్న, నాయకులు మేర శ్రీనివాస్, పోలగాని సతీశ్, బండి రాజయ్య, భాస్కర్, కోడూరి శ్రీనివాస్, గంగిపెల్లి శ్రీనివాస్ ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

గోదావరిఖనిటౌన్: త్రైత సిద్ధాంత భగవద్గీత 9రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఏడోరోజు శనివారం గోదావరిఖనిలో ప్రచారం చేపట్టారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన గ్రంథాలను ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక భువనగిరి, లక్సెట్టిపేట, మహబూబాబాద్, హైదరాబాద్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, తొర్రూరు, అచ్చంపేట కమిటీల అధ్యక్షులు, సభ్యులు దేవేంద్ర, ఆర్.రాజు, కృష్ణవేణి, గిరి, రవీందర్‌రెడ్డి, నిరంజన్ సిద్ధాంతి, సుధాకర్, సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్: ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జగదీశ్వర్‌రావు జర్నలిస్టులను సన్మానించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామకృష్ణ, మాజీ సర్పంచు, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు మాదాసు సతీశ్ నేతృత్వంలో కేక్ కట్ చేశారు. ఆయా వేడుకల్లో డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సొన్నాయిటెంకం చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సిద్ధం సదానందం పటేల్, గౌరవాధ్యక్షుడు కోటేశ్వర్, జర్నలిస్టులు వీరగోని రమేశ్, అనుముల అనంతరెడ్డి, మేకల మల్లేశ్, మెట్టు మధు, శ్రీమంతుల కొండాల్, జిలుకర రమేశ్, వెంకట్రాజం, రాజేశ్వర్‌రావు, అశోక్, దేవేందర్, సురేశ్, అజయ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మె సందర్భంగా సీఐటీయూ నాయకులు ఆర్జీ–1 యాజమాన్యానికి శనివారం సమ్మె నోటీసు అందజేశారు. డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబుకు సీఐటీయూ నాయకులు సమ్మెలేఖ అందజేశారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, ఉపాధ్యక్షులు ఆసరి మహేశ్, తోట నరహరిరావు, అన్నబోయిన శంకరన్న, నంది నారాయణ, పెద్దపల్లి శశికుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

జ్యోతినగర్: జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు అధికారులకు ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు శనివారం ఈడీ కార్యాలయంలో సమ్మె నోటీసు అందించారు. వారు మాట్లాడుతూ 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు చిలుక శంకర్, భూమల్ల చందర్, నాంసాని శంకర్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజమల్లయ్య, ఇజ్జగిరి భూమయ్య, సత్యం, చింతల సత్యం, వైకుంఠం పాల్గొన్నారు.

ప్రతిపాదనలు, సర్వేలకే పరిమితం

- అభివృద్ధి పనులు మంజూరైనా.. ఆదిలోనే అవాంతరాలు
- పాలకుల తీరుపై పాలకుర్తి ప్రజల అసహనం



జిల్లా కోర్టు భవన సముదాయాల కోసం కేటాయించిన స్థల పత్రాలను జడ్జికి అందజేస్తున్న తహసీల్దార్ (ఫైల్)

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గం పరిధిలో నూతన మండలంగా ఏర్పాటైన పాలకుర్తి మండలాన్ని అభివృద్ధి ఊరిస్తోంది. మండల కేంద్రంగా ఆవిర్భవించి దాదాపు ఎనిమిదేళ్లు పూర్తికావస్తున్నా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో మండల ప్రజలు పాలకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి మంజూరవుతున్న అభివృద్ధి పనులు సకాలంలో అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అవి కేవలం ప్రతిపాదనలు, సర్వేలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. పాలకుర్తి మండలం అనేక ఏళ్లుగా అభివృద్ధికి ఆమడదూరంలోనే కొనసాగుతోందని మండలవాసులు ఆరోపిస్తున్నారు.

15ఏళ్లుగా ఊరిస్తున్న విమానాశ్రయం

బసంత్‌నగర్‌లో నూతనంగా విమానాశ్రయం ఏర్పాటు అంశం స్థానికులను 15ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. 2008 నుంచి 2017 వరకు అప్పట్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాల అభ్యర్థన మేరకు ఏఏఐ (ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) అధికారులు స్థానికంగా పలుమార్లు సర్వేలు నిర్వహించారు. విమానాశ్రయ ఏర్పాటుకు కావాల్సిన భౌగోళిక, వాతావరణ పరిస్థితులను పరిశీలించి తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. అయినా ఇప్పటివరకు స్థానికంగా విమానాశ్రయం ఏర్పాటుపై ఎలాంటి స్పష్టత రాకపోగా ప్రస్తుతం నూతనంగా అంతర్గాం మండల పరిధిలో విమానాశ్రయం ఏర్పాటు కానుందనే ప్రచారం జరుగుతోంది. కొన్నిరోజుల క్రితం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సంబంధిత స్థల పరిశీలన కూడా చేపట్టారు.

పెండింగ్‌లో జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణం..

జిల్లా కోర్టు భవన సముదాయాలను పాలకుర్తి మండల పరిధిలో నిర్మించేందుకు అధికారులు మూడేళ్ల క్రితం స్థల సేకరణ చేశారు. స్థానిక రాఘవాపురం రైల్వేస్టేషన్ సమీపంలో కన్నాల రెవెన్యూ శివారులో సర్వేనెంబర్ 425లో 2ఎకరాల 20గుంటలు, పెద్దపల్లి మండలం రాఘవాపురం రెవెన్యూ శివారులో సర్వేనెంబర్ 192లో 4ఎకరాల 20గుంటలు మొత్తం 7ఎకరాల ప్రభుత్వభూమిని కేటాయించారు. 2022 ఆగస్టులో అప్పటి పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జి అర్జున్‌కు సంబంధిత భూమిని కోర్టు భవన నిర్మాణానికి కేటాయిస్తూ సంబంధిత పత్రాలను అప్పటి పాలకుర్తి, పెద్దపల్లి మండలాల తహసీల్దార్‌లు సంయుక్తంగా అందజేశారు. మూడేళ్లు గడుస్తున్నా జిల్లా కోర్టు భవన నిర్మాణాలపై ఎలాంటి పురోగతి లేదు.

వ్యవసాయ మార్కెట్ నిర్మాణం విషయంలో నిరాశే..

రామగుండం నియోజకవర్గ పరిధిలోని రైతుల సౌలభ్యం కోసం 2017లో పాలకుర్తి మండల పరిధిలోని పుట్నూర్ గ్రామశివారులో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధంగా నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణం కోసం 10ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా మార్కెట్‌యార్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎనిమిదేళ్లు కావస్తున్నా మార్కెట్‌యార్డు నిర్మాణం విషయంలో ఎలాంటి పురోగతి లేదు. స్థానికంగా మార్కెట్‌యార్డు నిర్మాణంతో తమ కష్టాలు తొలగిపోతాయని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. ఈవిధంగా మండలానికి మంజూరవుతున్న అభివృద్ధి పనులకు ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతుండటం, వాటిని అమలు చేయడంలో పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై మండలవాసుల్లో తీవ్ర అసహనం వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు మండల అభివృద్ధిపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

సింగరేణి వార్తలు

క్లర్క్ పోస్టులు వెంటనే భర్తీ చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో ఖాళీగా ఉన్న క్లర్క్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 మార్చి14న 360 ఖాళీలతో క్లర్క్ ఉద్యోగుల కోసం నోటిఫికేషన్ జారీ చేశారని, తిరిగి సవరణ చేసి 2025 జనవరి 10న నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. అప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్ క్లరికల్ గ్రేడ్ పరీక్షలు వాయిదా పడుతూ వస్తున్నాయి. చాలా మంది క్లర్కులు ఉద్యోగ విరమణ పొందడంతో డిపార్ట్‌మెంట్లలో క్లర్క్ పోస్టుల కొరత ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఉన్న క్లర్క్‌లకు పనిభారం పడుతోందని తెలిపారు. కార్మికులకు సంబంధించిన ప్రమోషన్లు, వారసత్వ ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు ఆలస్యం కావడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. నా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి తక్షణమే క్లర్క్ ఉద్యోగుల కోసం పరీక్షలు నిర్వహించి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కేంద్ర కమిటీ నాయకులు ఎల్.ప్రకాశ్, ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్, అన్నారావు, శాంసన్, సాంబశివరావు, రవికుమార్, సంపత్, మహేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు



గోదావరిఖని: వేడుకల్లో నాయకులు



రామగిరి: వేడుకల్లో బెల్లం శ్రీనివాస్

గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు సదానందం ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, లక్ష్మీపతిగౌడ్, టైసన్ శ్రీనివాస్, శారద, ఆంజనేయులు, బాపు, శంకర్, సదానందం, బుచ్చిరెడ్డి, మల్లయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే హక్కులు సాధ్యం

గోదావరిఖని: కార్మికవర్గం హక్కులు ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని ఏరియా వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ అన్నారు. ఏరియాలో శనివారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి, నారగోని దశరథంగౌడ్, ఐరెడ్డి సంపత్‌రెడ్డి, సాలిగామ మల్లేశ్, లింగమూర్తి, మేకల శ్రీనివాస్, మార్కండేయ, తోకల సమ్మయ్య, బర్ల రవీందర్, అవినాశ్ పాల్గొన్నారు.

ఆర్జీ–3 ఏరియాలో..

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో శనివారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఐఎన్‌టీయూసీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఓసీపీ–2, ఏపీఏలలో పిట్ సెక్రటరీలు రామిండ్ల మనోహర్, కొమురయ్య, సెంటినరికాలనీలో కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు ఉడుత శంకర్ జెండా ఆవిష్కరించారు. జీఎం కార్యాలయంలో బ్రాంచ్ సెక్రటరీ బెల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు జ్యోతి, సౌమ్య, మల్లిక, మారుతి, ప్రేమ్, ఓదెలు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో ఆవుల ఆరోగ్య పరిరక్షణ

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: కృత్రిమ మేధ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో కృత్రిమ మేధ వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. తొలుత ఆవుల ఆరోగ్య పరిరక్షణపై నీర్ ఇంటరాక్టివ్ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం మండలాల్లో ఉన్న ఆవుల ఆరోగ్య పరిరక్షణకు ప్రయోగాత్మకంగా కృత్రిమ మేధను వినియోగిస్తున్నామన్నారు. నాలుగు మండలాల్లోని ఆవుల వివరాలు, వాటి యజమానుల సమాచారం సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. కృత్రిమ మేధను వినియోగిస్తూ ఆవులకు సోకే గాలికుంటు, లంగ్స్ ఇన్‌ఫెక్షన్ తదితర వ్యాధులను ముందుగానే గుర్తించాలన్నారు. ఇందుకు అవసరమైన చికిత్స అందజేయడం ద్వారా ఆవుల సంరక్షణ సాధ్యమవుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్, నీర్ ఇంటరాక్టివ్ సంస్థ సీఈవో జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మంథని: నియోజకవర్గంలోని మల్హర్ మండలం వల్లెంకుంట గ్రామానికి చెందిన అడుప కిషన్, సూధాటి వెంకటేశ్ శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. శనివారం మంథనిలోని రాజగృహలో జరిగిన కార్యక్రమంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

యువత క్రీడలపై దృష్టిసారించాలి



బహుమతి అందజేస్తున్న ఎస్సై స్వామి

పాలకుర్తి: యువత వ్యసనాలకు బానిసలుగా మారి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, క్రీడలపై దృష్టిసారించి ఉన్నత స్థాయిలో రాణించేలా కృషి చేయాలని బసంత్‌నగర్ ఎస్సై ఆర్.స్వామి కోరారు. బసంత్‌నగర్ పోలీసులు, మక్కాన్‌సింగ్ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో నిర్వహించిన అంతర్గాం, పాలకుర్తి మండలాల రాజన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల ముగింపు సమావేశం శనివారం స్థానిక కేశోరాం వర్కర్స్‌క్లబ్‌లో జరిగింది. ఎస్సై మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 34జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో ఫైనల్‌లో సన్‌రైజర్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.30వేల నగదు, రన్నర్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.15వేల నగదు బహుమతిని అందజేశారు. కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గంగాధర రమేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పర్శవేని శ్రీనివాస్, పాత రవీందర్, తువ్వ సతీశ్, సూర అంజి, క్రీడాకారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ అధికారులతో సమీక్ష

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ అధికారులతో శనివారం జెడ్పీ సీఈవో నరేందర్ సమీక్షించారు. ఇటీవల రాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా వివిధ కేటగిరీలకు వచ్చిన దరఖాస్తులు తదితర విషయాలపై చర్చించారు. బ్యాంకుల వారీగా దరఖాస్తుల విభజన చేసి సంబంధిత బ్యాంకులకు సమర్పించాలని ఆదేశించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న సదరు బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా రుణగ్రహీతల సామర్థ్య స్థాయి పరిశీలించి వారే స్క్రూటినీ చేయనున్నట్లు మండల పరిషత్ సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్ తెలిపారు.

హక్కులను కాలరాస్తున్నారు

మంథని: రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంథనిలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. మంథని ప్రచార కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పోలు శివ, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పెంటరి రాజు, మాజీ ఎంపీపీ కొండ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో శ్రీవిన్య (581), శ్రీవాస్తవ్ 580 మార్కులు సాధించారు. వీరిని కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి, ఉపాధ్యాయులు సారయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• సింగరేణి క్వార్టర్‌లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీలో జంగ అర్జున్ అనే సింగరేణి కార్మికుడు నివాసం ఉంటున్న టీ2–1518 క్వార్టర్‌లో దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం అర్జున్ ఏప్రిల్ 29న వీర్లపల్లిలోని తమ బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి ఈనెల 3న ఇంటికి రాగా ఇంటి ముందు గేట్ తాళం పగిలి తలుపులు తెరిచి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంట్లోకి వెళ్లి బీరువా రూ.20వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితుడు అర్జున్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

• పేకాట స్థావరాలపై దాడి

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి చందనాపూర్ గ్రామ శివారులోని పేకాట ఆడుతున్న స్థావరాలపై శుక్రవారం రాత్రి టూటౌన్ ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చందనాపూర్ గ్రామ శివారులో కొంత మంది కలిసి పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై సురేశ్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న 18మందిలో 9మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకోగా, 9మంది పారిపోయినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.33వేల నగదు, ఒక ఆటో, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

• కాంట్రాక్టు కార్మికులకు ఏరియర్స్ చెల్లించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్ టౌన్‌షిప్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రూ.1,020 అలవెన్సుల ఏరియర్స్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, బ్రాంచి కార్యదర్శి బుచ్చన్న, జిల్లా నాయకులు పి.స్వామి శనివారం వినతిపత్రం అందించి ఒక ప్రకటన విడుదల చేశారు. టౌన్‌షిప్ ఏరియాలో కన్జర్వెన్సీ విభాగంలో 30ఏళ్ల నుంచి వివిధ కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు 2022 ఒప్పందం ప్రకారం అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

• వినియోగంలోకి చేతి పంపు

మంథని: మంథని మండలం చల్లపల్లిలో కొన్ని రోజులుగా పనిచేయని చేతిపంపునకు సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద చేతిపంపు పనిచేయక మంచినీటికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానికులు సింగిల్‌విండో చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన చైర్మన్ సొంత ఖర్చులతో మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

• చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన గాండ్ల రాజమ్మ(70) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పొత్కపల్లి ఏఎస్సై కిషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాజమ్మ శుక్రవారం ఇంట్లో పనులు చేసుకుంటుండగా విషపురుగు కుట్టడంతో అస్వస్థతకు గురికాగా సుల్తానాబాద్ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిందని మృతురాలి కుమారుడు గాండ్ల సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

• రామగుండంలో ప్రజారోగ్యశాఖ తనిఖీలు

జ్యోతినగర్: రామగుండం నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్న చంద్రబాబు కాలనీలోని ఓ కిరాణం దుకాణానికి రూ.రెండువేలు, ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని రెస్టారెంట్‌కు రూ.పదివేల జరిమానా విధించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ ఉన్నారు.

• నేడు ఇందిరమ్మ కమిటీలతో సమావేశం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఇందిరమ్మ గ్రామ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొంటారని, ఇందిరమ్మ గ్రామ కమిటీలు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

గోదావరిఖనిటౌన్: జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో విజయవంతం చేసేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు కోరారు. అదనపు జిల్లా న్యాయస్థాన ఆవరణలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖని సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్, జూనియర్ సివిల్ జడ్జిలు వెంకట సచిన్‌రెడ్డి, వెంకటేశ్ దుర్వ, స్వారిక, ఏజీపీలు శాంతన్‌కుమార్, కిషన్‌రావు, సౌజన్య, ఏపీపీ సహీద ఫర్హీన్, సబ్ డివిజనల్ ఏసీపీ మడత రమేశ్‌గౌడ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాలను వినియోగించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో ఏకాంబరం

రామగుండం: వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అంతర్గాం మండల విద్యాధికారి ఏకాంబరం సూచించారు. అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వేసవి క్రీడా శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడలు మానసిక దృఢత్వానికి, శారీరక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ తుల శోభారాణి, ఫుట్‌బాల్ కోచ్ శ్రీనివాస్, జయకుమార్, కృష్ణమూర్తి, నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మహేశ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని కూనారం వేసవిబడి కేంద్రాన్ని ఎంఈవో శనివారం సందర్శించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సర్వే



సర్వే చేస్తున్న తహసీల్దార్ రవీందర్‌పటేల్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్, టీటీఎస్ అంతర్గాం గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై గ్రామాల ప్రత్యేకాధికారి, తహసీల్దార్ తూమ్ రవీందర్‌పటేల్ క్షేత్ర సర్వే చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న వారి ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలపై పరిశీలించి నివేదిక రూపొందించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు గొర్రె చందు, కేసరి విజయ, కార్యదర్శి సాదుల కమల ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



విద్యార్థులకు సన్మానం

పాలకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన, పూర్తిస్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో బోధన అందిస్తున్నామని మండల విద్యాధికారి విమల అన్నారు. కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విద్యార్థి విజయీభవ ర్యాలీలో ఎంఈవో పాల్గొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. గ్రామ మాజీ సర్పంచ్ మల్క చంద్రకళ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మల్క రామస్వామి, ప్రధానోపాధ్యాయులు కమలాకర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు పాల్గొన్నారు.

నేడు ఆలయానికి గడప పెట్టే పూజా కార్యక్రమం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం గడప పెట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముప్పిరితోట హనుమాన్ భక్త బృందం తెలిపింది. భక్తులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుప్పకూలిన స్పిన్నింగ్ మిల్లు కార్మికుడి క్వార్టర్



రామగుండం: అంతర్గాం టెక్స్‌టైల్ కాలనీలోని బర్మా కాందీశీకుడు, స్పిన్నింగ్ మిల్లు మాజీ కార్మికుడు బోకం రాము క్వార్టర్ శనివారం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. బోకం రాము భార్య 20ఏళ్ల క్రితమే మృతిచెందింది. కాగా ఇద్దరు కూతుళ్లు, ఒక అబ్బాయి ఉన్నారు. అందరూ వివాహితులే. కాగా 55ఏళ్ల క్రితం నిర్మించిన స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్‌లోనే రాము తన కుమారుడితో ఉంటున్నాడు. నెలరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాము నడుము ఎముకకు తీవ్ర గాయమవడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఈక్రమంలో శనివారం అతను నివాసముంటున్న క్వార్టర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ విషయమై బర్మా, కాందీశీకుల సంఘం అధ్యక్షుడు జమ్ముల రామారావు కలెక్టర్‌కు, మిల్లు లిక్విడేటర్‌గా ఉన్న అదనపు కలెక్టర్, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ ఏడీకి ఫిర్యాదు చేశారు.